నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఆలయం ఎదుట వేసిన చలువ పందిళ్లు

నేటి నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

- 21న ఎదుర్కోలు, 22న తిరుకల్యాణ మహోత్సవం
- 23న దివ్య విమాన రథోత్సవం
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పాత గుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో సోమ వారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

25 వరకు ఉత్సవాలు

బ్రహ్మోత్సవాలను సోమవారం ఉదయం10 గంటలకు స్వస్తి వాచనం, పుణ్యా హవచనం, రక్షాబంధనంతో ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు అంకురారోపణం, మృత్స్యంగ్రహణం చేపడుతారు. 20న ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, హోమం, వేద పారాయణం, సాయంత్రం 6 గంటలకు దేవతాహ్వానం, భేరీపూజ నిర్వహి స్తారు. 21న ఉదయం 10 గంటలకు హవనం, సింహవాహన అలంకార సేవ, సాయంత్రం 6 గంటలకు హోమం, అశ్వవా హన అలంకార సేవ, అనంతరం ఎదుర్కోలు మహోత్సవం చేపడుతారు. 22న ఉదయం 10 గంటలకు తిరుమంజనం, హనుమంత వాహన అలంకార సేవ, 6 గంటలకు హోమం, రాత్రి 8 గంటలకు గజవాహన అలంకార సేవ, తిరు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 23న 10 గంటలకు గరుఢ వాహన అలంకార సేవ, 6 గంటలకు రథాంగ హోమం, 8 గంటలకు దివ్యవిమాన రథో త్సవం జరిపిస్తారు. 24న 10 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్ర తీర్థం, సాయంత్రం 6 గంటలకు దేవతోద్వా సన, పుష్పయాగం, డోలోత్సవం నిర్వహిస్తా రు. 25న ఉదయం 10 గంటలకు అష్టోత్తర శత ఘటాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంట లకు మహదాశీర్వచనం, పండిత సన్మానం చే పట్టి ఉత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

కల్యాణ టికెట్ రూ.600

స్వామి వారి తిరు కల్యాణ మహోత్స వంలో పాల్గొనే భక్తులకు కల్యాణ టికెట్టు రూ. 600 నిర్ణయించినట్లు ఆలయ ఈఓ రామకృ ష్ణారావు తెలిపారు. శత ఘటాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ. 250 చెల్లించాల్సి ఉంటుందని, ఒక టికెట్‌పై ఇద్దరికి ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పాతగుట్టలో నిత్య కల్యాణం, మొక్కు కల్యాణం, హోమాలు రద్దు చేస్తు న్నట్లు చెప్పారు. 23న రథోత్సవం సంద ర్భంగా రాత్రి ఆర్జిత సేవలు, అర్చనలు, శతనా మార్చనలు, బోగాలు, 24న చక్రతీర్థం సంద ర్భంగా అభిషేకం, అర్చనలు, 25న అష్టోత్తర శత ఘటాభిషేకం సందర్భంగా అభిషేకాలు, అర్చనలు రద్దు చేస్తున్నామని తెలిపారు.

పాతగుట్ట అధ్యయనోత్సవాలు పరిపూర్ణం

పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆల యంలో ఈ నెల 15న ప్రారంభమైన అధ్యయ నోత్సవాలు ఆదివారం పరిపూర్ణమయ్యాయి. పాతగుట్ట ప్రధానాలయంలో నిత్యారాధనలు అనంతరం స్వామివారిని అలకంరించి ఆళ్వా రాధుల ముందు ప్రబంధ పారాయణాలను పఠించి, భక్తుల దర్శనార్థం తిరువీధుల్లో ఊరే గింపు సేవను నిర్వహించారు. ఉత్సవమూర్తు లకు తిరుమంజన, నవకలశ స్నపన మహోత్స వాన్ని ప్రధానార్చకులు నల్లన్‌ధీఘశ్ లక్ష్మీనర సింహాచార్యులు, కాండూరి వేంకటాచా ర్యులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు వేద పండితులు వైభవంగా జరిపారు. ఆధ్యయనో త్సవాలకు విచ్చేసిన దివ్యప్రబంధ పారాయణి కులను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు.

మెట్లమార్గంలో భక్తుల రద్దీ

భక్తుల సందడి

యాదగిరి గుట్ట స్వయంభూ లక్ష్మీనర సింహ స్వామికి నిత్య పూజలు ఘనంగా జరి గాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసిం హుడిని మేల్కొలిపిన అర్చకులు ఆరగింపు చేపట్టారు. నిత్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మ వార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామివారిని దర్శిం చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ భక్తు లతో నిండిపోయాయి. స్వామివారిని సుమారు 22 వేల మంది భక్తులు దర్శించుకు న్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ. 35,52,253 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చలమల కృష్ణారెడ్డి చేరిక చెల్లదు

- యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : హైద రాబాద్‌కు చెందిన కొందరు లీడర్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే దొంగ చాటున క్యూ లైన్‌లో నిలబడి కండువా కప్పించుకున్న చల మల్ల కృష్ణారెడ్డి చేరిక చెల్లదని యాదాద్రి భువ నగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజే పీలో కొనసాగుతున్న చలమల కృష్ణారెడ్డి జిల్లాకు చెందిన ఏ నాయకులకు సమాచారం ఇవ్వకుండా పార్టీలో చేరడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం ప్రయ త్నించిన చలమల కృష్ణారెడ్డి జిల్లా ముఖ్య నేత లతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై దుర్భా షలాడాడని పేర్కొన్నారు. కృష్ణారెడ్డి తన చీకటి వ్యాపారాలను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరాడని, పార్టీలో ఆయన చేరికల చెల్ల దని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

కరువు సమయానికి కాళేశ్వర గంగ

20 రోజులుగా జిల్లాకు కొండపోచమ్మ సాగర్ జలాలు

- బొమ్మల రామారం, తుర్కపల్లి(ఎం) మండలాల్లో 31 చెరువుల్లోకి నీళ్లు
- పెరిగిన భూగర్భ జలాలు..యాసంగిలో 2,500 ఎకరాలకుపైనే పంటల సాగు

కరువు సమయానికి కాళేశ్వరం జలాలు యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చి చేరుతున్నాయి. వేసవి కాలంలో సైతం చెరువులు జలకళ సంతరించుకున్నాయి. యాసంగి సీజన్‌లో రైతులకు సాగునీటి సమస్య రాకుండా చూడాలన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల సాకారం అవుతున్నది. మాజీ సీఎం కేసీఆర్ దూర దృష్టితో ఈ మధ్య కాలంలో వర్షాలు లేక ఎండిపోతున్న చెరువుల్లోకి బిరబిరా అంటూ గోదారమ్మ వచ్చి చేరుతున్నది. వర్షాలు లేకపోయినా పంటల సాగు చేస్తామన్న సంకల్పం రైతుల్లో కలుగుతున్నది.

– యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18

తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్‌లో కాలువలో ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలు



కాళేశ్వరం జలాల రాకతో పచ్చగా వరిపంట

జనవరి 30 నుంచి నీటి విడుదల

గత జనవరి 30వ తేదీన సిద్దిపేట జిల్లా మర్కూర్ వద్ద కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి, ఎం. తుర్కపల్లి కాల్వలో 1.50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 12 చెరువులు నింపగా 1,496.24 ఎకరాల ఆయకట్టుకు నీరు అందు తున్నది. ఎం.తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 19 చెరువులు నింపగా 1,496.24 ఎకరాలకు సమృద్ధిగా సాగు నీరు అందుతున్నది. రైతులు రంది లేకుండా యాసంగి పంటలు పండించుకుంటున్నారు.

నిండుతున్న చెరువులు

కొండ పోచమ్మ సాగర్ నుంచి నీటి విడుదలతో తుర్కపల్లి(ఎం) మండలంలోని గోపాల్‌పూర్‌లోని పోచమ్మ చెరువు 45 శాతం, చిన్నలక్ష్మాపూర్‌లోని ధాపల్ చెరువు 35 శాతం, మాదాపూర్‌లో జగ్గయ్యచె రువు 30 శాతం, కొత్తచెరువు 50 శాతం, గోపాల్‌పూర్ లోని పొట్టొని కుంట చెరువు 100 శాతం నిండింది. బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడిలో రామసామితండా చౌటకుంట 30 శాతం, నల్లచెరువు 10 శాతం, ఎర్రకుంట 20 శాతం, తిమ్మాపూర్‌లోని గూడెంచెరువు 25శాతం, తిమ్మప్ప చెరువు 50 శాతం, ప్యారారంలోని మల్లన్న చెరువు 20 శాతం, సోలిపేటలోని ఊరు చెరువు 20 శాతం నిండింది.

ఎం. తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా..

తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి కొత్తకుంట 18శాతం, పత్తి చెరువు 95 శాతం, మైసమ్మకుంట 100 శాతం, బండదరాణి కుంట 98శాతం, చాపలకుంట 100 శాతం, తుర్కపల్లిలోని బహుదురియా చెరువు 77 శాతం, వెంకటాపూర్‌లోని సుదినేని చెరువు 25శాతం, తోక చెరువు 20 శాతం, మల్కాపూర్ లోని ఇప్పకుంట 97శాతం, రాళ్లవానికుంట 95 శాతం, ముల్కలపల్లిలోని చౌదరికుంట 20శాతం, కుమ్మరికుంట 10శాతం, ధర్మారం లోని విట్టల్ చెరువు, గోవిందు చెరువు, గొల్ల గూడెంలో కపాల్ చెరువు, కొత్త చెరువు, పటేల్ చెరువు 100 శాతం, పల్లెపహాడ్‌లోని సోమయ్య చెరువు 100 శాతం, బొమ్మలరా మారం మండలంలోని మల్లారెడ్డి చెరువు 77శాతం కాళేశ్వరం జలాలతో నిండాయి. మరికొన్ని రోజుల్లో ఆయకట్టు చెరువులను వంద శాతం నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్‌లో నిండుగా చెరువు

2020 నుంచే..

జిల్లాకు సాగు జలాలు అందించాలన్న లక్ష్యంతో స్థానిక మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి 2020లో తుర్కపల్లి ప్రధాన కాల్వకు కొండపోచమ్మ సాగర్ జలాలను విడుదల చేయించారు. 2023లో ఎం.తుర్కపల్లి కాల్వకు సైతం నీటిని విడుదల చేశారు. నాటి నుంచి పలు దఫాలుగా జిల్లాలోని రెండు మండలాలకు కాళేశ్వరం జలాలు వచ్చి చేరుతు న్నాయి. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం భూగర్భ జలాలు గణ నీయంగా తగ్గుముఖం పట్టాయి. వ్యవసాయానికి నీళ్లు అందే పరిస్థితి లేదు. గతే డాదితో పోలిస్తే తుర్కపల్లిలో 3.55 మీటర్లు, బొమ్మలరామారంలో 2.62 మీటర్లు పాతాళగంగ పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల వరి పంట ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత జనవరి 30న ఇరిగేషన్ అధికారులు కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు.

హన్మాపురం సబ్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్

- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు.. రూ.5కోట్ల మేర ఆస్తి నష్టం
- మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : జిల్లాకు విద్యుత్ సరఫరా చేసే హన్మా పురం 220 కేవీ సబ్‌స్టేషన్‌లో అర్ధరాత్రి దాటిన తరువాత షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమా చారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంట లను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.5కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని హన్మాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న సిబ్బంది ఇస్మాయిల్, భాస్కర్‌రెడ్డి రోజు వారి విధుల్లో భాగంగా రాత్రి 12 గంటలకు రీడింగ్ తీస్తుండగా స్వల్ప షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. వెంటనే పై అధికారుల సూచనల మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మంట లను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయి ల్‌తో మంటలు ఎగిసి పడుతుండటంతో ఫైరింజిన్‌కు సమాచారం అందజేశారు. హుటాహుటిన వచ్చిన ఆలేరు, భువనగిరి అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విధుల్లో ఇద్దరు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్ ఉండగా.. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి పరిశీలన

విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో కాలిపో యిన హన్మాపురం సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి ఆదివారం పరిశీలిం చారు. ప్రమాదం జరిగిన తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమా దంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరిక రాలు దగ్ధమయ్యాయని, సుమారు రూ.5కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. మరమ్మతు పనులను వేగవం తంగా చేపడుతున్నామని చెప్పారు. ఆయన వెంట డీఈ దంతూరి మల్లికార్జు న్‌గౌడ్, ఏడీఈ ఆనంద్‌రెడ్డి, విద్యుత్ అధి కారులు, సిబ్బంది ఉన్నారు.

హన్మాపురం సబ్‌స్టేషన్‌లో అర్ధరాత్రి ఎగసిపడుతున్న మంటలు

నేడు వెల్లంకికి గవర్నర్ తమిళి సై

- పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య నివాసానికి రాక
- నూతన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రంథాలయ నూతన భవనం

రామన్నపేట, ఫిబ్రవరి18 : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సోమవారం రామన్న పేట మండలంలోని వెల్లంకి గ్రామానికి రానును న్నారు. కూరెళ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన కూరెళ్ల గ్రంథాల యాన్ని ప్రారంభించనున్నారు. పాండిచ్చేరి పర్య టనలో ఉన్న గవర్నర్ ఉదయం 11గంటలకు చెన్నై విమానాశ్రయం నుంచి 11:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా బయలు దేరి 1 గంటకు వెల్లంకికి చేరుకుంటారు. గ్రంథాలయం ప్రారం భించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

హైకోర్టు జడ్జి ఏర్పాట్లు పరిశీలన

హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ గవర్నర్ రాక ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కూరెళ్ల గ్రంథాలయాన్ని, సభ ప్రాంగణాన్ని పరిశీలిం చారు. పోలీసులు గవర్నర్ రాక సందర్భంగా పటిష్ట బందోబ స్తును ఏర్పాటు చేశారు. శివాలయం, గుండ్రాంపల్లి రోడ్డులో వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆయన వెంట అడి షనల్ ఎస్పీ సీహెచ్ లక్ష్మీనారాయణ, తాసీల్దార్ లాల్‌బహ దూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, సీఐ వెంకటేశ్వర్లు ఎంపీఓ అంజిరెడ్డి ఉన్నారు.

ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తి

పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన ఆచార్య కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయం పై అంతస్తులో నూతన భవనం (సాయి సభ మందిరం) ప్రారంభోత్సవా నికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దీనిని ప్రారంభించనున్నారు. అలాగే విఠలాచార్య రచించిన కూరెళ్ల శతకం ద్వితీయ ముద్రణను ఆవిష్కరించనున్నారు. హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగే సభకు కలెక్టర్ హనుమంతు జెండగే, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రముఖ సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల సుభాశ్చంద్రబోస్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య హాజరు కానున్నారు. మధ్యాహ్నం సాహిత్య సదస్సును నిర్వహించనున్నారు.

మామిడిలో విచ్చుకోని పూత

- తేలిక పాటి తడులతో పరిస్థితులు తగ్గుముఖం
- ఇప్పటి నుంచి ఏప్రిల్ వరకు అప్రమత్తంగా ఉండాలి
- ఉద్యాన శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 18 : ప్రస్తుతం మామిడి తోటలు సగభాగం పచ్చ పూత, ఇంకొంత భాగం తెల్ల పూత, కొంత భాగం మొట్టెల తోటి (పూ మొగ్గ దశలో) పూత విచ్చుకోకుండా ఉన్నందున రైతులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంత రెడ్డి తెలి పారు. ఇలాంటి పరిస్థితుల్లో తోటలకు తేలికపాటి నీటి తడులు ఇచ్చినట్లయితే అదుపులోకి వస్తాయని చెప్పారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిందె పూత రాలిపోవడానికి నీరు, పోషక లోపమే కారణము. డ్రిప్పు పైపుల అమర్చే పద్ధతి కూడా ఉత్ప త్తిపై ప్రభావం చూపిస్తుంది. మధ్యాహ్నం ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పూత పిందెపై ప్రభావం చూపిస్తుంది. నీటి తడులు ఇచ్చేటప్పుడు మొదటి రెండు తడులు తేలికగా ఇచ్చిన తర్వాత మాత్రమే మూడో తడి పూర్తిగా ఇవ్వాల్సి వస్తుంది. లేని పక్షంలో పూత గానీ, పిందె గానీ రాలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుంది.
- చెట్టుకు తెల్ల, పచ్చ పూత కంటే మొట్టెలే (పూ మొగ్గలు)అధికంగా ఉంటే మల్టీ-కే (13-0-45) 5 కేజీ+సూక్ష్మ పోషక మిశ్రమం 2.5 కేజీ+ ప్లానోఫిక్స్ 100మి.లీ/ 500 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకో వాలి.
- పచ్చిపూత దశలో తేనె మంచు నివారణకు థయోమితాక్సమ్ 200 గ్రా లేదా ఫిప్రోనిల్ 80% డబ్ల్యూజీ 150 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 100 మిల్లీ లీటర్లు మరియు బూడిద తెగులు నివారణకు హెక్సా కొనజోల్ 1లీ+వేపనూనె 2 లీ. 500 లీటర్ల నీటిలో (ఒక డ్రమ్) కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూత విచ్చుకున్నాక 10-15 రోజుల వరకు పురుగు మందులు పిచికారీ చేయరాదు.
- తెల్లపూత చాలా సున్నితమైన దశ కాబట్టి తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పిండినల్లిని వీలై నంత వరకు పచ్చిపూత దశలోనే నివారించుకోవాలి
- ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలలో తప్పనిసరిగా యూరియా, పొటాష్, బోరాన్ వాడుకోవాలి. ఎరువులు ఎప్పుడైనా ఒకేసారి వేసే కంటే దఫాలుగా వేసుకోవడం వల్ల ఉత్పత్తి చాలా బాగుంటుంది. పూత నుంచి పిందెలు ఏర్పడి బఠానీ గింజ సైజులో ఉన్నప్పుడు పది సంవత్సరాలు పైబడిన ప్రతి చెట్టుకు, డీఏపీ 700 గ్రా, యూరియా -400 గ్రా, ఎంవోపీ-600 గ్రా. చొప్పున వేసుకొని నీరు పెట్టాలి.
- పిందె రాలకుండా, పిందెలు బఠానీ గింజల సైజులో ఉండి పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే మల్టీకే (13-0-45) 2.5 కేజీ+ సూక్ష్మ పోషక మిశ్రమం (ఫా ర్ములా-4) 2.5 కేజీ+ప్లానోఫిక్స్ 100ఎంఎల్‌ను 500 లీటర్ల నీటికి కలిపి ఆకులన్నీ తడిచేలా పిచికారీ చేసుకోవాలి.
- పండు ఈగ నివారణకు లింగాక ర్షణ బుట్టలను(మిథైల్ యూజి నాల్) ఎకరానికి10-25 ఏర్పాటు చేసి ప్రతి 20 రోజులకు ల్యూర్‌ను మారుస్తూ పంట పూర్తయ్యే వరకు కొనసాగించాలి.